ప్రభుత్వానికి టీచర్లే బ్రాండ్ అంబాసిడర్లు

- తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర
- ప్రభుత్వ బడుల్లోనే చదివి ఈస్థాయికి వచ్చా
- టీచర్లతో ముఖాముఖిలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో సిఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందని అనుకున్నామని, ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందని భావించామని చెప్పారు. కోదండరాం, చుక్కా రామయ్య హరగోపాల్ లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని ఆశించామని చెప్పారు. కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు ఉపాధ్యాయులను ఏ విధంగా అవమానించారో చూశామని సిఎం వ్యాఖ్యానించారు.

బడ్జెట్‌లో 7.3 శాతం నిధులు

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించామనీ, కానీ ప్రభుత్వ హామీలు, ఇతర శాఖల పనుల దృష్ట్యా 7.3 శాతం అంటే రూ.21 వేల కోట్లకు పైగా ఇచ్చినట్టు సిఎం చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో 26 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారనీ, 10 వేల ప్రయివేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ప్రయివేటు పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. నేను టీచర్లనే తప్పుబట్టలేను.. మా ప్రభుత్వ లోపాలూ ఉండొచ్చని, విద్యార్థులు, మహిళా టీచర్లకు కనీసం టాయిలెట్స్ కూడా అందుబాటులో లేని స్కూళ్లు ఉన్నాయన్నారు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజమన్నారు. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించామని, మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని సిఎం తెలిపారు.

తెలంగాణ భవిష్యత్ మీ చేతుల్లో..

తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు, మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం పెట్టామనీ, అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ చెప్పారు. టీచర్లంతా 90 శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు విద్యనందించాలనీ, గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో రెండు లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని సూచించారు. పేద విద్యార్థులను డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దాలనీ, ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్‌లుగా మార్చాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. 20 ఏళ్లుగా భాషా పండితులకు పదోన్నతులు లేవన్నారు. ఈసారీ 25 వేల మందికి ప్రమోషన్లు, 35 వేల మందికి ట్రాన్స్‌ఫర్లు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించామని ముఖ్యమంత్రి చెప్పారు. మీ జీతాలను స్కూళ్ల కోసం ఖర్చుపెట్టొద్దని, ప్రభుత్వ భరిస్తుందన్నారు. ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, నరోత్తంరెడ్డి, ఎవిఎన్ రెడ్డితోపాటు మోహన్‌రెడ్డి కూడా ఉపాధ్యాయుల సమస్యలపై తనతో ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారని అన్నారు. ఒకనాడు చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయ నాయకులకు విలువనిచ్చేవారనీ, గత పదేండ్ల కాలంలో అది లేదన్నారు.

కార్యదీక్షతో పనిచేయాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించామని సిఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రగ్స్‌ను నిరోధించేందుకు విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తామని, మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని, అందుకు ఇక్కడ ప్రతిజ్ఞ చేయాలని సిఎం సూచించారు.

అసెంబ్లీలో ఒకాయన..

అసెంబ్లీలో ఒకాయన నన్ను ఏడ చదివారంటూ వెటకారం చేశారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థాయి వచ్చానని సిఎం అన్నారు. నేను కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో, తాండ్ర హైస్కూల్, వనపర్తి జెడ్పీ హైస్కూలో, గవర్నమెంటు జూనియర్ కాలేజీలో చదువుకున్నానని సమాధానం చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వ టీచర్లు చెప్పిన చదువుతోనే జెడ్‌పిటిసి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపి, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాయని అని ఆన్నారు. "మీ మీద నమ్మకం లేక గుంటూరు పోయి వాళ్లు చదువుకోవచ్చు.. నాకు మీ మీద పూర్తినమ్మకముందన్నారు".

దశాబ్దం తర్వాత టీచర్లకు ప్రమోషన్లు
పొన్నం ప్రభాకర్ గౌడ్

దాదాపు దశాబ్ద కాలం తర్వాత టీచర్లకు ప్రమోషన్లు వచ్చాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పేదలకు చదువుకునే అవకాశం కలిగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాలని కోరారు.

పండుగ వాతావరణం నెలకొంది : కోదండరామ్

టీచర్లకు భారీస్థాయిలో ప్రమోషన్లు ఇవ్వడంతో పండుగ వాతావరణం నెలకొందని కోదండరామ్ అన్నారు. జీవితకాలంలో ఒక్క ప్రమోషనైనా పొందాలని ఆశించడం తప్పుకాదన్నారు. 2014 నుంచి ఎదురుచూస్తున్నామని చెప్పారు. హెల్త్‌కార్డులు అవసరం ఉందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత టీచర్లదేననీ, తద్వారా మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. ఇది మన కర్తవ్యమన్నారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వాగతోపన్యాసం చేస్తూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు , ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ధరణిపై విచారణ జరపండి : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'ధరణి'పై విచారణ జరిపించాలని సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ పోర్టల్ పూర్తిగా అవకతవకలతో కూడి ఉందనీ, దీనివల్ల రాష్ట్రంలో నయా భూస్వాములు తయారయ్యారని అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో 'తెలంగాణ భూమి హక్కులు -సంస్కరణలు' అంశంపై జరిగిన లఘుచర్చలో ఆయన మాట్లాడారు. ధరణి వల్ల గ్రామాల్లో అప్రకటిత అల్లకల్లోలం ఏర్పడిందనీ, అప్పటి సిఎం కెసిఆర్ అందరి సలహాలు తీసుకొని, ఐఎఎస్ అధికారి సోమేష్ కుమార్ మాట మాత్రమే విన్నారని, ఆయన మాయలో ఎలా పడ్డారో అర్థంకావట్లేదన్నారు. సమగ్ర భూ సర్వే చేయనందువల్ల అనేక అవస్థలు ఎదురయ్యాయనీ, రాష్ట్ర ప్రజల ఆస్తుల వివరాలన్నింటినీ ఐఎఫ్ఎల్ఎస్ అనే ప్రయివేటు సంస్థ చేతికి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఐఎఫ్ఎస్ఎస్ ఒప్పందాన్ని రద్దు చేయాలనీ, మాన్యువల్‌గా భూసర్వే చేయాలని కోరారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న రైతులకు కౌలు పట్టా ఇవ్వాలనీ, వారికి రైతుబీమా, రైతుబంధు వర్తింప చేయాలని కోరారు.

IN THE COURT OF THE 2ND ADDL. DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSSION AT BANGALORE

COMPLAINT.NO. 189/2023

Between:Lakshmi Kurthkoti, D/o Surya narayana Rao, Aged about 53 years, R/at No. 100, 2nd Main road, west of Chord road, Bangalore-560086. R/o. 100, 2nd Main Road, Bangalore-86. **...Complainant**

And: Sanatana (Vydika) Dharma Parirakshna Trust, And others **...Opposite parties**

Opposite party. NO.6. Sri. Phanikumar S. Executive Trustee, No.627, Rajamandary Road, Vishakapatnam, Hyderabad,

NOTICE

Where as your attendance is necessary to answer the complaint filed against you by the said complainant, to direct the opposite party to pay Rs.4,11,600/- along with interest 18%. Hence you have to file your version as per the provisions of Consumer Protection Act, 2019. Therefore, you are called upon to appear and give version on **31/8/2024 at 10:30 a.m.** before this Commission. If you omit or fail to take any action to represent your case as so required, the complaint will be heard and determined ex-parte in your absence.

Given under my hand on the seal of this Court this District Commission on this day 1/8/2024

BY the Order of Commission.
Sd/- Asst. Registrar Cum
Asst. Administrative Officer,
Bengaluru Urban
2nd Addl. District Consumer
Disputes Redressal Commission,
Bengaluru-560027.

సుప్రీం ఆదేశాల అమలుకు కార్యాచరణ చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సూచించింది. ఎస్సి, ఎస్టి ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో ఎస్సి కేటగిరీలో మరింత వెనుకబడిన కులాలకు విడివిడిగా కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూల అంశమని తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తీర్పును అమలుపరచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనంటూ తీర్పులో స్పష్టంగా పేర్కొన్నదని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుచేయడానికి అవసరమైన అన్ని రకాల చర్యలూ రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఎస్సిల్లోని వెనుకబడిన కులాలను విధాన నిర్ణయాల పరిధిలోకి తీసు కొచ్చేందుకు కసరత్తు చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బిసిల్లోనూ అత్యంత వెనుకబడిన కులాలు (ఎంబిసి)లు కడు పేదరికం అనుభవిస్తున్నారని తెలిపారు. రిజర్వేషన్ల ఫలితాలు అన్ని తరగతులకూ దక్కాలంటే బిసిల్లో వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఈ వర్గీకరణను స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లకు వర్తింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

- హైటెక్స్‌లో రెరా గుర్తింపు ప్రాజెక్టుల ప్రదర్శన
- విక్రయానికి 800 పైగా ప్రాజెక్టులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైటెక్స్‌లో క్రెడాయబిలిటీ నేపథ్యంతో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శనను ఐజిబిసి నేషనల్ వైస్ ఛైర్మన్ సి శేఖర్ రెడ్డి, క్రెడాయ్ నేషనల్ సెక్రటరీ జి రామ్ రెడ్డి, క్రెడాయ్ నేషనల్ ఇసి మెంబర్ సిహెచ్ రామచంద్రారెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఆగస్టు 2 నుండి 4వ తేదీ వరకు నిర్వహించ నున్న ఈ ప్రదర్శనలో పారదర్శకత, విశ్వసనీయతను కోరుకునే విభిన్న కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా కేవలం రెరా నమోదిత ప్రాజెక్టులను మాత్రమే ప్రత్యేకంగా ప్రదర్శనకు పెట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి రాజశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి, సెక్రటరీ బి జగన్నాథరావుతో పాటు ఇతర క్రెడాయ్ నాయకులు, సభ్యులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, ఇతర విక్రేతలు పాల్గొన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు అందుబాటు ధరలలో ఉండే గృహాల నుండి అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఓపెన్ ప్లాట్లు, వాణిజ్య సముదాయాలు మొదలైన 800 కంటే ఎక్కువ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. దీనిని అనుసరించి తదుపరి రెండు ప్రాపర్టీ షోలు ఆగస్టు 9 నుండి 11 వరకు కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్స్‌లో, ఆగస్టు 23 నుండి 25 వరకు నాగోల్ మెట్రో స్టేషన్‌లో జరుగుతాయి. డెవలపర్‌లు, బిల్డింగ్ మెటీరియల్ తయారీదారులు, కన్సల్టెంట్‌లు, ఆర్థిక సంస్థలతో సహా విభిన్న శ్రేణి రియల్ ఎస్టేట్ నిపుణులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

హైదరాబాద్ రియాల్టీకి డిమాండ్ : వి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో అత్యుత్తమ ఆస్తులను అన్వేషించడానికి గృహ కొనుగోలుదారులకు విశ్వసనీయమైన, సమగ్రమైన వేదికను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వి రాజశేఖర్ రెడ్డి తెలి పారు. ఈ నేపథ్యంలోనే ప్రాపర్టీ షోనూ ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 4వ నగరంగా నిలిచిందన్నారు. తాము గురువారం సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యామన్నారు. హైదరాబాద్ 2050కి సంబంధించిన విజన్‌ను సిఎం వెల్లడించారని, అది చాలా ప్రోత్సా హకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అభివద్ధిని విస్తరించడానికి ప్రాంతీయ రింగ్‌రోడ్ కోసం రూ.1,525 కోట్లు కేటాయించడం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోశించనుందన్నారు. తాము పండుగ సీజన్‌లోకి అడుగు పెట్టడానికి ముందు ఆగస్టులో మూడు ప్రధాన ప్రదేశాలలో 'క్రెడాయబిలిటీ' నేపథ్యంతో కూడిన ప్రాపర్టీ షోలను ప్రదర్శించడం పట్ల సంతోషిస్తున్నామని క్రెడాయ్ హైదరాబాద్ సెక్రటరీ బి జగన్నాథరావు అన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు వారి సముఖమునకు
I.A. No. 437/2023 in I.A. 327/2010 in O.S. No. 67/2006

బిట్వీన్ :
ఘంటా నాగేశ్వరరావు .... పిటీషనర్ / వాది
అండ్
ఘంటా రాజేంద్రప్రసాద్ అండ్ 5 అదర్స్ ..... రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
టు
1) 4వ రెస్పాండెంట్/ఎల్.ఆర్.ఎఫ్. 3వ రెస్పాండెంట్ : మండవ రాధాకృష్ణరావు, తండ్రి బాపయ్య, డోర్ నెం. 3-3-8, బాగ్ అమీరి, నియర్ సిద్దార్ధ టవర్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072.
2) 5వ రెస్పాండెంట్/ఎల్.ఆర్.ఎఫ్. 3వ రెస్పాండెంట్ : మండవ రామబాబు, తండ్రి రాధాకృష్ణరావు, డోర్ నెం. 3-3-8, బాగ్ అమీరి, నియర్ సిద్దార్ధ టవర్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072.
3) 6వ రెస్పాండెంట్/ఎల్.ఆర్.ఎఫ్. 4వ రెస్పాండెంట్ : మండవ హరిబాబు, తండ్రి : రాధాకృష్ణరావు, డోర్ నెం. 3-3-8, బాగ్ అమీరి, నియర్ సిద్దార్ధ టవర్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072.

పై నెంబరు పిటీషన్‌లో 3వ ప్రతివాది చనిపోయినందున ఆమె వారసులు అయిన మీకు నోటీసులు ఈ ప్రకటన ద్వారా శ్రీ కోర్టువారి ఉత్తర్వులతపై అమలు పరచడమైనది. కావున మీరు స్వయంగా గానీ, లేక అడ్వకేటుగారి ద్వారా ది. 16-8-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై మీ సమాధానము లిఖిత పూర్వకంగా తెలియజేయవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించబడునని తెలియజేయడమైనది.

అవనిగడ్డ
ది. 2-8-2024
ఇట్లు
గొల్లి గౌరీశంకర్, ఎం.కాం., బి.ఎల్.,
పిటీషనర్/వాది తరపు అడ్వకేటు,
అవనిగడ్డ - 521121

వెబ్‌సైట్‌లో భూమాత ముసాయిదా

- మూడు వారాల్లో అభిప్రాయాలు చెప్పండి
- ధరణి పోర్టల్ గడీల కుట్ర, మోసం
- సమస్యలు పరిష్కారం కాక రైతుల ఆత్మహత్యలు
- శాసనసభలో భూమి హక్కులు, సంస్కరణలపై స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమాత ముసాయిదా (డ్రాఫ్ట్) చట్టాన్ని శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో ఉంచామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆ చట్టంపై మూడు వారాల్లో రైతులు, మేధావులు, ప్రజాసంఘాలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. పలువురి సూచనలు, సలహాల మేరకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో భూమాత చట్టాన్ని తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ధరణిపై ప్రయోగాత్మకంగా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించామని మంత్రి తెలిపారు. 'తెలంగాణ భూమి హక్కులు మరియు సంస్కరణలు' అనే అంశంపై శుక్రవారం శాసనసభలో స్వల్పకాలిక చర్చను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీమేరకు ఆ చట్టాన్ని సమర్థవంతంగా తీసుకొస్తామన్నారు. అన్యాక్రాంతమైన సామాన్యుల భూములను తిరిగి ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ గడీల్లో సిద్ధమైందనీ, కుట్రపూరితంగా, మోసపూరితంగా జరిగిందని ఆరోపించారు. అపరమేధావిగా, అనుభవజ్ఞునుడిగా పేరొందిన ఓ పెద్ద మనిషి ధరణి పేరుతో రైతులను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల దృతరాష్ట్ర కౌగిలి నుంచి రైతులు విముక్తి చెందారని అన్నారు. ధరణితో రైతులు ఎంత నష్టపోయారో ఆ కోపాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో చూపించారని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, చివరకు సిసిఎల్ఎ స్థాయిలో కూడా భూ సమస్యలు పరిష్కారం కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎల్ఎఫ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరు మార్చి సింగపూర్‌కు చెందిన కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోటి యాభై లక్షల ఎకరాలకు సంబంధించిన వివరాలను విదేశీ కంపెనీ చేతుల్లో పెట్టారని వివరించారు. ఇతర దేశాల్లో డిఫాల్టర్ అయిన ఆ కంపెనీకి ఆ పోర్టల్‌ను ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సాదాబైనామాలను పట్టించుకోలేదనీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొమ్మిది లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో కొన్నింటిని పరిష్కరించామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం సామాన్యుల భూములను నిషేధిత జాబితాలో పొందుపరిచిందని విమర్శించారు. రైతులు తమ అవసరాల కోసం సొంత భూమిని కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 18 లక్షల ఎకరాల భూమిని పార్ట్ బీలో పెట్టారని తెలిపారు. చివరకు అసైన్డ్ ల్యాండ్స్‌ను కూడా లాక్కున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాటికి 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ, అందులో కొన్నింటిని పరిష్కారించామనీ, త్వరలో మిగతా వాటిని క్లియర్ చేస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను అకారణంగా తిరస్కరించిందనీ, కనీసం కారణాలు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలనీ, తిరస్కరిస్తే అందుకు తగిన కారణం కూడా చెప్పాలని అధికారులను ఆదేశించామన్నారు. నాలుగు గోడల మధ్య చట్టాలను చేయబోమనీ, ప్రజల అభిప్రాయాల మేరకే భూమాతను తీసుకొస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఇదే అంశంపై కాంగ్రెస్ సభ్యులు సంజీవరెడ్డి తన అభిప్రాయాలను చెప్పారు.

కొత్తచట్టాలతో పోలీసుల రాజ్యం

- మా సభ్యులు సభలో వీడియో తీయలేదు
- కెమెరాలన్నీ పరిశీలించండి: కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం తీసుకొచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలతో రాష్ట్రంలో పోలీసులరాజ్యం నడిచే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లు, తెలంగాణ శాసనముల మార్పు బిల్లులను శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడారు. వామపక్ష, ప్రజాసంఘాల ఉద్యమాలు క్రియాశీలకంగా ఉన్న తెలంగాణలో ఆ చట్టాల అమలు సరిగాదన్నారు. భావ వ్యక్తీకరణను హరించేలా కొత్త చట్టాలున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఆ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కూడా నేరమని చెప్పారు. గతంలో కాంగ్రెస్ సభ్యులతో పాటు సిఎం కూడా పలుమార్లు ధర్నాలు చేశారని గుర్తుచేశారు. భవిష్యత్తులో ధర్నాలు చేయడానికీ ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షంలో ఎవరున్నా ప్రజల తరఫున నిరసనలు చేయడం పరిపాటేనన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం వాళ్లు సభ పెట్టుకుంటామంటే అనుమతి తీసుకోలేదని నిరాకరించడం ఏంటని ప్రశ్నించారు. ఏ చట్టం ఉపయోగించి నిరాకరించరో తెలియడం లేదన్నారు.

కాంగ్రెస్ కట్టే డ్యాంలు సాగర్‌లా దృఢంగా ఉంటాయి

- పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం కట్టే డ్యాంలు నాగార్జున సాగర్‌లా దృఢంగా ఉంటాయని, బీఆర్ఎస్ వాళ్లు కట్టే ప్రాజెక్టులు కాళేశ్వరం ప్రాజెక్టులా కుంగిపోతాయని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన సాగునీటిని విడుదల చేశారు. లో లెవల్ కెనాల్ దగ్గర పూజలు నిర్వహించిన అనంతరం నాగార్జునసాగర్ విజయ విహార్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. రాష్ట్రంలో 30 నుంచి 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దశాబ్ద కాలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇంత త్వరగా సాగునీటిని విడుదల చేసింది తామేనని అన్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని వదిలామని, దారిపొడవునా సాగునీటికి, తాగునీటికీ చెరువులు నింపుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కల్పించాలని ప్రభుత్వం సంకల్పంతో ఉందని చెప్పారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల పది సంవత్సరాలుగా నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్ర ఆయకట్టుకు సాగునీరిచ్చారని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ద్వారా కూడా సాగునీరు ఇవ్వలేదని చెప్పారు. మెడిగడ్డ బ్యారేజ్ నాసిరకం పనులతో చేయడం, నిర్వహణ సైతం లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ముఖ్యంగా ఎస్ఎల్బీసి, డిండి, బ్రాహ్మణ వెళ్లెంలా, పిల్లాయిపల్లిని పూర్తి చేస్తామని తెలిపారు. నల్లగొండ, మిర్యాలగూడ తదితర అన్ని నియోజకవర్గాల్లో కొత్త ప్రాజెక్టులతోపాటు పాత ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు రూ.22,500 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇందులో రూ.10,828 కోట్లు ఆగిపోయిన ప్రాజెక్టుల పనులకు, రూ.11 వేల కోట్లు ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యయం కింద తీసుకున్నట్టు వివరించారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా 11,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు.

ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో నీరు ఇస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అన్ని చెరువులను నింపుతామన్నారు. ఎస్ఎల్‌బిసి పూర్తికి తమ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, దీని ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు, తాగునీరు అందుతుందని అన్నారు. పెండింగ్ ప్రాజెకులన్నీ పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. మూడేండ్లలో అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మంత్రులకు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, ఎస్‌పి శరత్ చంద్రపవార్, ఇరిగేషన్ సిఇ నాగేశ్వర్‌రావు, ఇంజనీరింగ్ అధికారులతో పాటు, పలువురు ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, ఎస్ఇ, ఇఇలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.NO.2405 OF 2023

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager **...Plaintiff**

And

Sri Gorrela prasada Rao, S/o, father's name not known to the plaintiff,aged about 33 years, Occ; Self Employed, R/o. H.NO. 12-12-96, Janatha Nagar, Moosapet, Hyderabad-500018 **...Defendant**

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,51,318.76Ps. (Rupees Two Lakh Fifty One Thousand Three Hundred Eighteen and Seventy Six Paise\only) with subsequent interest @ 2.95% per month compounded monthly and service charges from date of suit till realisation and costs and the same stands posted to 30-08-2024 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500 036
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff

'మాఫీ'కాని చిక్కులు

- రుణమాఫీ పథకంలో అడుగడుగునా ప్రతిబంధకాలు
- బ్యాంకర్ల కిరికిరి.. గడువు తేదీలతో రైతుల్లో గందరగోళం
- రేషన్‌కార్డే కాకుండా ఇతరత్ర అనేక సమస్యలు
- ప్రభుత్వం దృష్టి సారించకపోతే మరింత పెరగనున్న సమస్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రుణమాఫీ పథకంలో రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిలో కొన్ని బ్యాంకర్ల నుంచి తలెత్తుతుండగా, మరికొన్ని నియమ నిబంధనల కారణంగా పుట్టుకొస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ అధికారులు, కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ డెస్కులు, బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా అనేక సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆరోపిస్తున్నారు. మరోవైపు 2018 డిసెంబర్ 12, 2023 డిసెంబర్ 9 గడువు తేదీన రిలీజ్ చేసిన పంట రుణాలకే ఈ స్కీమ్ వర్తిస్తుందనే నిబంధన ఉండటంతో కొందరు అర్హత కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని బ్యాంకులు రెన్యూవల్ చేసినప్పుడు లోన్ అకౌంట్ నంబర్ మారుస్తుండగా కొన్ని మాత్రం యథాతథంగా ఉంచుతున్నాయి. ఫలితంగా అనేక మంది రైతులు అర్హతున్నా అనర్హులుగా పరిగణించబడ్డారు. ఇలాంటి రైతులు ఆన్‌లైన్ స్టేటస్ (రుణమాఫీ స్థితి) చెక్ చేస్తే 'రుణం మంజూరైన తేదీ నిబంధన ప్రకారం లేదు' అని చూపిస్తోంది. అదే రైతుకు మరో బ్యాంకులో అకౌంట్ ఉంటే దాని స్థితి తీసుకుంటే 'టూ బీ ప్రాసెస్డ్' అని వస్తోంది. ఒకే రైతు ఒకే సమయంలో రెండు వేర్వేరు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుంటే ఒక్కో దాంట్లో ఒక్కో స్టేటస్ చూపిస్తుండటంతో రేషన్‌కార్డు ఉన్నా పంట రుణమాఫీ పథకానికి చాలా మంది రైతులు అర్హత కోల్పోతున్నారు.

రెన్యూవల్ చేసినా పాత తేదీతోనే..

కొన్ని బ్యాంకుల్లో రెన్యువల్ చేసినా పాత మంజూరు తేదీనే రుణమాఫీ పథకం కోసం పంపించడంతో సంబంధిత ఖాతాదారులు అర్హత కోల్పోతున్నారు. ఖమ్మంలోని ఐడిబిఐ బ్యాంకు నుంచి ఈ తరహా సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమయ్యాయని తెలుస్తోంది. అన్ని బ్యాంకుల్లో ఏ రోజైతే రెన్యువల్ చేస్తారో ఆ తేదీనే లోన్ మంజూరు చేసినట్టుగా పేర్కొనగా.. ఐడిబిఐ మాత్రం దీనికి విరుద్ధంగా ఏ తేదీన తొలిసారి లోన్ మంజూరైందో దాన్ని పంపించడంతో ఈ బ్యాంకుకు చెందిన అనేక మంది రైతులు అర్హతున్నా.. మాఫీ స్కీమ్‌ను కోల్పోతున్నారు. రెన్యువల్ తేదీ ఆధారంగా ఫైల్స్‌ను పంపించకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైనట్టుగా తెలుస్తోంది. చింతకాని మండలం నుంచి అత్యధిక రైతులు ఖమ్మంలోని ఈ ఐడిబిఐ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. ఇప్పుడు వారందరిలో ఆందోళన నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా ఖాతాలు సుమారు మూడు లక్షల వరకు ఉన్నట్టు తెలుస్తోంది.

ఈ చిక్కు తీర్చేదెవరు..?

ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం పంచాయతీకి చెందిన శాబాదు నారాయణరెడ్డి 2017 జనవరిలో ఖమ్మంలోని ఐడిబిఐ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నారు. అదే సమయంలో డిసిసిబి, ఖమ్మం రూరల్ బ్రాంచి నుంచి కూడా రుణం పొందారు. ప్రతి సంవత్సరం అసలు + వడ్డీ చెల్లించి రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. 2023లోనూ రెన్యువల్ చేశారు. కానీ డిసిసిబిలో ఫ్రెష్‌లోన్ తీసుకున్నట్టుగా చూపుతుండగా.. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తున్నా ఐడీబీఐలో మాత్రం 2017లోనే లోన్ తీసుకున్నట్టుగా ఫైల్ పంపడంతో రుణమాఫీ స్టేటస్‌లో "రుణం మంజూరు అయిన తేదీ నిబంధనల ప్రకారం లేదు" అని వస్తోంది. ఇప్పుడు నారాయణరెడ్డికి రుణమాఫీ స్కీమ్ వర్తిస్తుందా? లేదా? అని ఆ కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2 లక్షల కంటే ఎక్కువుంటే చెల్లిస్తేనే మాఫీనట..!

రూ.2 లక్షల కంటే బ్యాంకుల్లో రుణం ఎక్కువగా ఉంటే చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఏమి చేయాలో అర్థంకాని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు బ్యాంకర్లు మాత్రం రూ.2 లక్షలు మాఫీ అయ్యాక, ఆపైన అదనంగా ఉన్న డబ్బులు చెల్లించి కొత్త లోన్ తీసుకోవాలని సూచిస్తున్నారు. గ్రీవెన్స్ డెస్కులు కేవలం స్టేటస్ చెప్పడం తప్ప కచ్చితమైన సమాధానాలు ఇవ్వలేకపోతున్నాయని బాధితులు అంటున్నారు.

అర్ధరాత్రి తర్వాత ప్రొసీజర్ ఇవ్వడం ఏంటి?

- సబ్జెక్టుపై సభ్యులు ప్రిపేర్ కావొద్దా? : అక్బరుద్దీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సభకు సంబంధించిన కార్యక్రమాల వివరాలను, బిల్లులను అర్ధరాత్రి రెండు గంటలకు ఇవ్వడమేంటి? పొద్దుగాలనే హడావిడిగా చర్చ పెట్టి ఆమోదింపజేయడమేంటి? 25 ఏండ్లుగా తాను సభలో ఉంటున్నాను. ఎన్నడూ ఇలాంటి పద్ధతిని చూడలేదు' అంటూ ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన జోక్యం చేసుకుని మాట్లాడారు. ఒక సబ్జెక్టుపై చర్చ పెట్టే ముందు సభ్యులు సన్నద్ధం కావడానికి కొంత సమయం ఇచ్చేవారని చెప్పారు. ఇప్పుడు అదేంలేదన్నారు. చర్చకు పెట్టే సబ్జెక్టుపై సభ్యులు ప్రిపేర్ అయ్యి రావొద్దా? సమగ్ర చర్చ జరగొద్దా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది సభకు మంచిది కాదన్నారు. ఈ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు.

ఇహెచ్‌ఎస్ రేట్లను పెంచాలి

- అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఇహెచ్‌ఎస్) రేట్లను పెంచాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం శాసనమండలిలో నర్సిరెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం అమలు చేస్తున్న ఇహెచ్‌ఎస్ సమస్యలపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఇహెచ్‌ఎస్ రేట్లు 15 ఏండ్ల క్రితం నిర్ణయించినవని గుర్తుచేశారు. ఇహెచ్‌ఎస్‌లో అత్యధికంగా రూ.2 లక్షలిస్తే, కార్పొరేట్ ఆస్పత్రులు ఐదారు లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగం కంటే ప్రయివేటు వైద్యరంగం ఎక్కువగా విస్తరించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ వ్యవస్థ నియంత్రిం చడం, చికిత్సల ధరలను ప్రభుత్వమే నిర్ణయించడం అవసరమని అభిప్రాయ పడ్డారు. 2010 క్లినికల్ ఎస్టాబ్లిష్ చట్టం రాష్ట్రంలో అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. పిసిపి ఎన్‌డిటి, ఎఆర్‌టి, ఫుడ్‌సేఫ్టీ చట్టాలను పటిష్టం గా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. పోలీసులందరిని ఒకే వేదికగా ఏకరూపకంగా తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం ఎఆర్‌ఆర్, సివిల్ తదితర పేర్లతో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదాయ, వక్ఫ్‌బోర్డు ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. లేకపోతే అన్యాక్రాంతమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ సభ్యులు వాణిదేవి మాట్లాడుతూ, బాలికలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రభుత్వాలు మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. బిఆర్‌ఎస్ సభ్యులు తాత మధు మాట్లాడుతూ.. అవివాహిత గర్భిణుల గర్భవిచ్ఛిత్తి (అబార్షన్స్) పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టవిరుద్ధంగా జరుగుతున్న వీటిపై వైఖరి మారాలని కోరారు.

ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకుంటాం

- నా వీడియోని ఎడిట్ చేసి వైరల్ చేస్తున్నారు
- ఉచిత బస్సు ప్రయాణంపై అసత్యప్రచారం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోషల్ మీడియాలో జరుగుతున్న దాడులు, వస్తున్న ఫేక్ వీడియోలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు మక్కన్‌సింగ్‌తో తాను మాట్లాడుతున్న వీడియోను మార్ఫింగ్‌తో అసభ్యకరంగా చిత్రీకరించి వైరల్ చేయడం దారుణమన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కెటిఆర్ మాట్లాడే సమయంలో మంత్రి జోక్యం చేసుకుని ప్రసంగించారు. ఇప్పటిదాకా 70 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని చెప్పారు. కొందరు కావాలనే వీడియోలు క్రియేట్ చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఊరికే బస్సుల్లో అటూఇటూ తిరగడానికి ఎవ్వరూ ఖాళీగా ఉండరనీ, ఎవరైనా అవసరాల కోసమే బయటకు వస్తారని చెప్పారు. మహిళలను అవమానపరిచే విధంగా వీడియోలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాంటి వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భావప్రకటనా స్వేచ్ఛ గురించి కెటిఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వందల మంది మీద కేసులు పెట్టారనీ, తన కార్యకర్తలు కూడా కేసులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గిరిజనులు, మహిళా మంత్రి అయిన సీతక్క మీద మీమ్స్ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలిగానీ, అది ఇతర వ్యక్తులను కించపరిచేలా ఉండొద్దని అన్నారు. సభా కార్యక్రమాలను వీడియో తీసి సభ్యులను కించపరిచేలా వీడియోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.

సిఎం సభ్యత్వం ఉంటుందో ఊడుతుందో!

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లి వచ్చేసరికి ఆయన సభ్యత్వం ఉంటుందో ఊడుతుందో చూసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన సిఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు అవుతుందో.. లేదో కానీ, సిఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లి వచ్చే వరకు ఆయన సభ్యత్వం రద్దయ్యేలా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల మంత్రులు.. రేవంత్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేసేలా ఉన్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీలో తనకు మైక్ ఇవ్వడం లేదన్నారు. హుజురాబాద్ ప్రజలకు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలన్నారు. హుజురాబాద్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగితే ప్రభుత్వం స్పందించలేదన్నారు. తన వేతనం నుంచి రూ.4లక్షలు వారికి ఇచ్చినట్టు తెలిపారు. హుజురాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా వారిని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

భావప్రకటనా స్వేచ్ఛపై దాడి

ధర్నాలకూ పోలీసుల అనుమతి కావాలా : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనూ, రాష్ట్రంలోనూ భావప్రకటనా స్వేచ్ఛపై దాడులు తీవ్రమయ్యాయని సిపిఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూప సవరణ, తెలంగాణ శాసనాల మార్పు సవరణ బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం కార్మికులు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేయడానికి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ధర్నాచౌక్‌ను ఎత్తేస్తే పునరుద్ధరణ కోసం అన్ని పార్టీలూ పోరాటం చేశాయని, హైకోర్టు ద్వారా విజయం సాధించాయని గుర్తుచేశారు. అసెంబ్లీ జరిగే సమయంలో ధర్నాలు చేస్తే సభదృష్టికి వచ్చి సమస్యల పరిష్కారం అవుతాయనే ఆశతో కార్మికులు ఉంటారన్నారు. వాళ్లేం ఉగ్రవాదులు కాదు.. అసెంబ్లీ దాడి చేసే వారు కదా..కేవలం సమస్యను ఎత్తిచూపాలనే ప్రయత్నంలో భాగంగానే ధర్నాలు చేస్తారన్నారు. కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గత ప్రభుత్వ దారిలో పోవద్దని సూచించారు. ఉపా చట్టం రాష్ట్రంలో యథేచ్ఛగా అమలవుతున్నదన్నారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా పోయిందని, రచయితల సంఘాలపై దాడులు చేస్తున్నారని వాపోయారు. ఎఫ్‌ఐఆర్ లేకుండానే విచారణల పేరిట జైళ్లలో వేస్తున్నారన్నారు. దేశద్రోహం కేసులు పెడుతున్నారని చెప్పారు. కొత్త చట్టాల పేర్లు చదవలేని విధంగా ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం దిశగా దృష్టిసారించేందుకు జడ్జీలు, సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు.

కళాకారులకూ ఓ పాలసీ తీసుకురావాలి

రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కూనంనేని చెప్పారు. క్రీడల్లో యాక్టివ్‌గా ఉండే పిల్లలకు చిన్నతనం ఉచిత విద్యతో పాటు కోచింగ్ అందించాలని కోరారు. అదే సందర్భంలో కళాకారుల కోసమూ ఒక పాలసీ ఉండాలని అభిప్రాయపడ్డారు. వారికి హెల్త్ కార్డులు, రేషన్‌కార్డుల మంజూరు, ఇతరత్రా సదుపాయాల కల్పనపై ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే గ్రూపు-4 ఉద్యోగులు, హోంగార్డులు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే కార్మికులు రోజంతా నిలబడి ఉద్యోగం చేయలేకపోతున్నారని, తమిళనాడు తరహాల్లో వారికి కూర్చునే హక్కు కల్పిస్తూ ఒక చట్టం తేవాలని విన్నవించారు.

నిరసన తెలుపుతున్న తెలంగాణ సర్పంచుల సంఘాల జెఎసి నాయకులు

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయడం తగదు

- గాంధేయమార్గంలో నిరసన తెలిపే హక్కు లేదా?
- మానవతా దృక్పథంతో బిల్లులు చెల్లించండి
- తెలంగాణ సర్పంచుల సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని గాంధేయ మార్గంలో సచివాలయం ఎదుట నిరసన తెలుపుతామంటే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం తగదని తెలంగాణ సర్పంచుల సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ విమర్శించారు. శుక్రవారం సచివాలయం ఎదుట గాంధేయ మార్గంలో నిరసన తెలపడానికి బయలుదేరిన మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా అడ్డుకున్నారు. జెఎసి నాయకులను లక్డీకాపూల్‌లోని ద్వారకా హోటల్ సమీపంలో అరెస్టు చేశారు. వారిని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీత్ చంద్రరావు, ఉపాధ్యక్షులు గంటి మధుసూదన్‌రెడ్డి, పలు జిల్లాల అధ్యక్షులు ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌లోనూ వారు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుర్వియాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. సచివాలయం చుట్టూ వేలాది మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధించడం సరిగాదన్నారు. ఆరు వేల మంది మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. గాంధేయ మార్గంలో నిరసన తెలిపే హక్కు కూడా తమకు లేదా అని ప్రశ్నించారు. తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అడిగితే గొంతులను నొక్కేయడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ పనులు చేశామనీ, ఏళ్ల తరబడి బిల్లులను పెండింగ్‌లో పెట్టడం దారుణమని విమర్శించారు. అప్పులు తీర్చలేక, వాటికి వడ్డీలు కట్టలేక తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మాజీ సర్పంచులకు వెంటనే చెల్లించాలని కోరారు.

కాకతీయుల కళాతోరణం తీసేయొద్దు

- మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో రాచరిక చిహ్నాలను తొలగించాలన్న ఆలోచన విరమిల చుకోవాలని బిజెపిఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ, తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూప సవరణ, తెలంగాణ శాసనాల మార్పు సవరణ బిల్లులకు మద్దతు తెలుపుతున్నామ న్నారు. రాష్ట్ర చిహ్నంలోని కాకతీయుల కళాతోరణాన్ని ప్రభుత్వం తీసేయబోతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆ నిర్ణయం సరిగాదని చెప్పారు. రాచరికపు చిహ్నాలు తొలగించాలని, టిఎస్‌ను టిజిగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయంపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారు. సివిల్ కోర్టులు అద్దెభవనాల్లో ఇంకా కొనసాగటం ఏంటన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. కొత్త కోర్టు భవనాలు కట్టాలని కోరారు. జడ్జీలను, కోర్టుల సంఖ్యను పెంచాలని సూచించారు.

చిన్నారులపై దారుణాలు

- నిజామాబాద్‌లో లైంగికదాడి
- ఉప్పల్‌లోని ఓ పాఠశాలలో బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తన
- విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అమానుష ఘటనలు.. దారుణాల పరంపర కొనసాగుతోంది.. రోజుకొక చోట బాలికలు, మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వరుస ఘటనలపై ఆందోళన వెల్లడవుతుండగా.. శుక్రవారం మరో రెండు ఘటనలు వెలుగుజూశాయి. ఉప్పల్‌లోని ఓ ప్రయివేటు పాఠశాలలో రెండో తరగతి చిన్నారిపై విద్యార్థి అసభ్యకరంగా ప్రవర్తించగా, నిజామాబాద్ కేంద్రంలో ఐదేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి చేశాడు. నిజామాబాద్ రెండో పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. బడాబజార్‌కు సమీపంలో గల కాలనీలో ఐదున్నర ఏళ్ల చిన్నారిపై అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ మేకల కాపరి లైంగిక దాడి చేశాడు. వీధిలో ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఆశ చూపించి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. గురువారం చిన్నారి కడుపునొప్పి ఉందని చెప్పగా.. తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం లైంగికదాడి జరిగినట్టు నిర్ధారించారు. వెంటనే కుటుంబ సభ్యులు రెండో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సో చట్టం కింద కేసును నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

బాలికతో బాలుడి అసభ్య ప్రవర్తన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని ఓ పాఠశాలలో బాలికతో 15 ఏళ్ల బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న బాలికపై తొమ్మిదో తరగతి బాలుడు గురువారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో చిన్నారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దాంతో ప్రిన్సిపల్ జోసెఫ్.. బాలిక తల్లిదండ్రులు, బాలుని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అనంతరం ఆ విద్యార్థికి టిసి ఇచ్చి పంపించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఫోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఐద్వా నాయకులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాలల్లో పిల్లలకు రక్షణ లేదని, ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్కూల్ ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తాం

- బ్యాగరి కంచెలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- బిసిసిఐతో సంప్రదింపులు పూర్తి
- క్రీడల ప్రోత్సాహానికి బడ్జెట్‌లో రూ.321 కోట్లు
- ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి

సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దాన్ని ప్రకటిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బ్యాగరి కంచెలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించబోతున్నామని వెల్లడించారు. దీనిపై బిసిసిఐతో సంప్రదింపులు జరపగా అంగీకరించిందనీ, త్వరలో భూములూ కేటాయిస్తామని తెలిపారు. యువతను వ్యసనాల నుంచి బయటపడేందుకు క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తామని, అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ బడ్జెట్‌లో రూ.321 కోట్లను కేటాయించామని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ రాష్ట్రాల పాలసీలు అధ్యయనం చేసి ఉత్తమ పాలసీని తీసుకొస్తామని స్పష్టం చేశారు. హర్యానాలో అత్యధికంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో క్రీడాకారులు మెడల్స్, పతకాలు సాధిస్తే నేరుగా ప్రభుత్వపరంగా దక్కాల్సినవన్నీ దక్కుతున్నాయని చెప్పారు. మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములుంటే స్టేడియాలు నిర్మించడానికి తమకేమీ అభ్యంతరం లేదన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకువచ్చేందుకు క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ పాలసీ కోసం ఎవరు సలహాలిచ్చినా స్వీకరిస్తామని చెప్పారు.

అందరూ అంగీకరిస్తే తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు: సిఎం

సభలోని అన్ని పక్షాల వారు అంగీకరిస్తే హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి తనకేం అభ్యంతరం లేదని ప్రకటించారు. సురవరం తెలుగు భాష ఉన్నతీకరించేందుకు కృషి చేశారని, తన సాహిత్యంతో, గోల్కొండ పత్రికతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు.

డిఎస్‌పిలుగా మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్

మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూపు-1 కేటగిరీ కింద డిఎస్‌పిలు నియమిస్తున్నట్టు సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. చదువులోనే కాదు క్రీడల్లో రాణిస్తే కూడా ఉన్నత ఉద్యోగం వస్తుందని, కుటుంబ గౌరవం పెరుగుతుందని విద్యార్థులకు తెలిసేలా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రాడ్యుయేట్ అయిన నిఖత్‌కు గ్రూపు-1 ఉద్యోగం ఇవ్వడానికి ఎలాంటి ఆటంకాలు లేవన్నారు. ఇంటర్మీడియట్ వరకే చదువుకున్న సిరాజ్ విషయంలో అది ఆటంకంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో టిఎస్‌పిఎస్‌సిలో క్రీడాకారుల విషయంలో మినహాయింపులు ఇచ్చేలా ప్రత్యేక చట్టసవరణ తీసుకొచ్చామన్నారు. నిఖత్‌జరీన్‌కు 600 గజాల ప్లాట్ ఇచ్చామనీ, సిరాజ్‌కూ కేటాయిస్తామని తెలిపారు.

స్కిల్ యూనివర్సిటీ బిల్లుకు మండలి ఆమోదం

- విపక్షాలతో పాటు చైర్మన్ సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం :మంత్రి దుద్దిళ్ల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" బిల్లుకు శాసన మండలి శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం మొదలగు సభ్యులందరూ తమ మద్దతు తెలిపారు. దాంతో బిల్లును ఆమోదిస్తున్నట్టు స్పీకర్ గుత్త సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. బిల్లుపై జరిగిన చర్చలో స్పీకర్‌తో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్సీలు పాల్గొని పలు సూచనలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను గ్రామాలకు అనుసంధానం చేయాలని రవిందర్‌రావు కోరగా, కులవృత్తులను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేయాలని తాత మధు సూచించారు. కొన్ని రంగాల్లో చదువుతో సంబంధం లేకుండా నైపుణ్యం ఉంటుందనీ, అలాంటి వాటిలో విద్యార్హతలను ప్రామాణికంగా కాకుండా వారి ఆసక్తి, స్కిల్‌ను పరిగణంలోకి తీసుకుని శిక్షణ అందించాలని భాను ప్రసాద్‌రావు విజ్ఞప్తి చేశారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ కోసం 200 ఎకరాల భూమిని కేటాయించారనీ, 13 ఏండ్లు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారభం కాలేదని అన్నారు. అలాంటి కంపెనీలపై ఒత్తిడి తెచ్చి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అడ్మిషన్లలో పేదలకు ఫీజు రాయితీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని మీర్జా రియాజిల్ హసన్ ఎఫెండీ కోరగా, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల కు నైపుణ్యంలో శిక్షణ అందించాలని దేశపతి శ్రీనివాస్ సూచించారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని కోటిరెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలి చైర్మన్ చర్చలో పాల్గొని పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని ఆగ్రో, డెయిరీతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో ఈ విద్యాసంస్థను భాగస్వామ్యం చేయాలని కోరారు. సాంకేతిక, ఇతర రంగాల్లో శిక్షణ తీసుకున్న వారు నేరుగా ప్రభుత్వ ఉద్యోగమని వెళ్లకుండా వారికి స్వయం ఉపాధి కల్పించేలా ప్రోగ్రామ్ డిజైన్ చేయాలని గుత్తా విజ్ఞప్తి చేశారు. అనంతరం సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమాధానం చెప్పారు.

నేటి డిగ్రీ.. రేపటి భవిష్యత్‌కు పునాది

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విజ్ఞానం, నైపుణ్యాలతో నేడు సాధించిన డిగ్రీ రేపటి భవిష్యత్‌కు పునాది అవుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహదూరుపల్లిలోని మహేంద్ర యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య సమాజంలో వ్యక్తి ఉన్నతికి ఎంతో తోడ్పడుతుందన్నారు. 21వ శతాబ్దంలో ప్రపంచం చాలా వేగంగా మారుతున్నదని, అవకాశాలను అందిపుచ్చుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. అందుకు తగ్గ నైపుణ్యం, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొన్ని దశాబ్దాలుగా పారిశ్రామిక యుగం సమాచార యుగానికి దారి తీసిందని, ఈ మార్పు ప్రపంచాన్ని అన్ని రకాల సరిహద్దుల్ని అనుసంధానించిందని అన్నారు. విజ్ఞానం, సమాచారం జాతీయ సరిహద్దులను దాటి అంతర్జాతీయ సరిహద్దులకు చేరుతుందన్నారు. అర చేతుల్లోనే ప్రపంచ స్థితిగతులు, వ్యాపార లావాదేవీలను అంతర్జాలం వల్ల తెలుసుకోగలుగుతున్నామని చెప్పారు. మన మేధో వనరులు ఈ సమాచార విస్ఫోటనానికి అనుగుణంగా లేవని, దాన్ని ఎదుర్కోవడానికి తగిన మేధో మధనం జరగాలని అన్నారు. డేటా సైన్స్ పరిశోధన సాధనంగా కీలక పాత్ర పోషిస్తోందని, ఉదాహరణకు ఖగోళ శాస్త్రంలో ఇది కొత్త నక్షత్రాలు, గెలాక్సీలను గుర్తించడంలో సహాయపడుతుందని చెప్పారు. అన్ని రంగాల్లో సైన్స్ ద్వారా విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనువైన, అతి చురుకైన జీవన విలువల గురించి దృష్టిలో పెట్టుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్స్ అత్యంత ఉత్తేజకరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారని, ప్రపంచంతో పోటీ పడటానికి భయపడాల్సిన అవసరం లేదని, ఎవరి శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు ఎందుకు ఉపయోగపడతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మార్టిన్ లూథర్ కింగ్ ప్రకారం "మీరు ఎగరలేకపోతే పరుగెత్తండి, మీరు పరుగెత్తలేకపోతే నడవండి, మీరు నడవలేకపోతే పాకండి, కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీ ప్రయత్నాలు ఆపకుండా ముందుకు సాగండి" అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులు వారి కలలను నెరవేర్చుకోవాలని సూచించారు. 2014లో మహీంద్రా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌గా ప్రారంభమైనప్పటి నుంచి దక్షిణ భారతదేశంలో ఒక ప్రధాన క్యాంపస్‌గా స్థిరపడిందని, ఈ విశ్వవిద్యాలయంలో ప్రసంగించడం గొప్ప విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఆనంద్ మహేంద్ర, గెస్ట్ ఆఫ్ హానర్‌గా శోభన కామినేని, వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.